బుధవారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 38.0°C | కనిష్ఠం : 23.0°C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	గురువారం	సా : 6.35 గం..
సహర్ :	శుక్రవారం	ఉ : 4.45 గం..

ఆయుష్.. అలంకారప్రాయం!

- ప్రజలకు అందుబాటులోకి రాని ఆరోగ్య మందిరాలు
- సంవత్సరం క్రితమే భవన నిర్మాణాలు పూర్తి
- నేటికీ యోగా శిక్షకులను నియమించని ప్రభుత్వం
- జిల్లాలో ఆరు ఆయుర్వేద, మూడు హోమియో, ఒక యునానీ వైద్యశాల



బయ్యారంలోని యునాని వైద్యశాలలో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్



బయ్యారం, ఏప్రిల్ 3 : ఆరోగ్యమే మహాభాగ్యం.. జబ్బు లేకుండా ఉంటే.. అంతకంటే ధనవంతుడు మరొకరు లేర నేది నానుడి. ప్రజలందరినీ ఆరోగ్యంగా ఉంచాలన్న సంకల్పంతో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా ఆయుష్ ఆరోగ్య మందిరాలను మహబూబాబాద్ జిల్లాలో ఏర్పాటు చేశాయి. వాటికి ఏడాది క్రితం భవన నిర్మాణాలు పూర్తయినా.. నేటికీ యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించకపోవటంతో ఆరోగ్య మందిరాలు నిరుపయోగంగా మారాయి. ఆయా ప్రభుత్వాల సమన్వయ లోపంతో 'ఆయుష్' ముందుకు సాగకపోవటంతో ఆరోగ్య రక్షణ జరిగేదెప్పుడోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజలు అనారోగ్యం బారిన పడకముందే..

వైద్యవిధానంలో ఆయుష్‌ది కీలకపాత్ర. ఆయుష్ అంటే ఆయుర్వేద, యోగా, యునాని, సిద్ధ, హోమియో కలగలిపిన మిశ్రమం. ఆరోగ్య రక్షణలో భాగంగా ఒకసిద్ధ మినహా.. మిగిలిన ప్రోగ్రాములన్నీ దేశవ్యాప్తంగా అమలు జరుగుతున్నాయి. సిద్ధ ప్రోగ్రాం మాత్రం కేవలం ఒక తమిళనాడు రాష్ట్రంలోనే అమలవుతోంది. ఈ ఆయుష్ ఆరోగ్య మందిరాలు నాన్ కమ్యూనికేషన్ వ్యాధులు, ఉపశమన మరియు పునరావాస సంరక్షణ.. మానసిక ఆరోగ్యస్థితిని మెరుగుపర్చటంతో పాటు మాతా, శిశుఆరోగ్య సంరక్షణ సేవలను మించి విస్తరించిన శ్రేణిసేవలను అందించడానికి ఉద్దేశించబడినది. మారుతున్న జీవనశైలికి అనుగునంగా సంబవించిన మార్పులు, కల్తీ ఆహారంతో తలెత్తే అనారోగ్యాలను నివారించేందుకు కూడా ఈ ఆయూష్ ఆరోగ్య మందిరాలు ఉపయోగకరంగామారనున్నాయి. ముఖ్యంగా ప్రజలు అనారోగ్యానికి గురికాక ముందే ఆరోగ్యరక్షణ చర్యలకు పూనుకుంటే ఆరోగ్యబాట పట్టడానికి ఆస్కారం ఏర్పడుతుందని ఆరోగ్యవంతులు, వైద్యులు సూచిస్తున్నారు.



ఒత్తిడిని (స్ట్రెస్) అధికమించేందుకు బలపాల పీహెచ్‌లో ప్రాణాయమం చేస్తున్న ఆశ వర్కర్లు

జిల్లా వ్యాప్తంగా పది భవన నిర్మాణాలు..

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 6 ఆయుర్వేద, 3 హోమియో, ఒక యూనాని వైద్యశాలలున్నాయి. తొర్రూరు, వడ్డె కొత్తపల్లి, పెద్దముప్పారం, చిన్నముప్పారం, కురవి, ముల్కనూరులోని ఆయుర్వేద వైద్యశాలలతో పాటు జామాండ్లపల్లి, గూడూరు, మన్నెగూడెంలోని హోమియో వైద్యశాలలు, బయ్యారంలోని యునాని వైద్యశాలలో ఆ ఆయూష్ ఆరోగ్య మందిరాలను నిర్మించారు. ఇందు కోసం జాతీయ ఆరోగ్యమిషన్ (ఎన్‌ఏఎం) కింద ఒక్కో నిర్మాణానికి రూ.6 లక్షలు చొప్పున మొత్తం రూ. 60 లక్షలు వెచ్చించారు. 2023 మార్చిలో ఈ నిర్మాణాలు పూర్తయ్యాయి.

శిక్షకుల నియామకంలో తాత్సారం..

గత సంవత్సరం క్రితం ఆయుష్ ఆరోగ్య మందిరాలు నిర్మాణాలు పూర్తయినా నేటికీ ప్రభుత్వం యోగా శిక్షకులను నియమించలేదు. ఆరోగ్య మందిరాలలో యోగ శిక్షకుడితో పాటు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో) ఉండేలా ప్రభుత్వం డిజైన్ చేసింది. కానీ, నేటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవటంతో నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. కాగా, ఈ ఆయూష్ ఆరోగ్య మందిరాలకు సంబంధించి నిర్మాణాలను కేంద్రప్రభుత్వ నిధులతో చేపట్టగా.. నిర్వాహణ బాధ్యత మాత్రం రాష్ట్రప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు సమాచారం. ఏదేమైనప్పటికి ఈ విషయంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సమన్వయ లోపంతో ఆయూష్ వైద్యసేవలు ప్రజలకు అందడం లేదు

నియామక ప్రక్రియ ప్రభుత్వ అంశం..

నిరంజిని, ఆయుష్ జిల్లా ఇన్‌చార్జ్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ తొర్రూరు



యోగా ఇన్‌స్ట్రక్టర్ల నియామక ప్రక్రియ ప్రభుత్వ పరిధిలోని అంశం. తమకు నిర్దేశించిన దాని ప్రకారం ఆయూష్ ఆరోగ్య మందిరాలను పూర్తి చేశాం. నియామక ప్రక్రియ పూర్తికాగానే మందిరాలనుప్రారంభిస్తాం. ఆరోగ్యవంతులను ఆరోగ్య రక్షణ చేయటం కోసం ఏర్పాటు చేసిన ఈ మందిరాలను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలి.

ఈవీఎంల పంపిణీ కేంద్రాల్లో నిఘా

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



జిల్లా కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈవీఎం పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని మరిపెడ, మహబూబాబాద్‌లో ఈవీఎం పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు. ఆయా పంపిణీ కేంద్రాల వద్ద సీసీ కెమెరాల నిఘా ఉంచామని వివరించారు. జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)ల పంపిణీ కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. మరిపెడ మండలకేంద్రంలోని సెయింట్ ఆగస్టిన్ స్కూల్, మహబూబాబాద్ పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ భద్రపరిచే, పంపిణీ చేసే స్ట్రాంగ్‌రూమ్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భారత్ ఎన్నికల సంఘం సూచన మేరకు ఎన్నికలకు ఒకరోజు ముందు స్ట్రాంగ్‌రూమ్‌ల నుంచి ఈవీఎంలను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మానుకోట, తొర్రూరు ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు పాల్గొన్నారు.

మొదటి రాండమైజేషన్ పూర్తి..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఈవీఎంల మొదటి రాండమైజేషన్‌ను పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత ఎన్నికల అధికారుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)ల మొదటి విడత రాండమైజేషన్ ఎన్నికల సంఘం సూచనల మేరకు ఆన్‌లైన్ విధానం ద్వారా కేటాయించారు. ఈ కేటాయింపుల ద్వారా 689 బ్యాలెట్ యూనిట్స్, 689 కంట్రోల్ యూనిట్స్ 760 వీవీ ప్యాట్స్ రాండమైజేషన్ ద్వారా అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఈవీఎంలను కేటాయించి గోడౌన్ నుంచి అందరి సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, ఎలక్షన్ సూపరింటెండెంట్ పవన్‌కుమార్, డీఎస్పీ తిరుపతిరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మార్నేని వెంకన్న, నీరుటి సురేష్‌నాయుడు, సాదుల శ్రీనివాస్, కొమ్మాల్‌రెడ్డి, రమణ పాల్గొన్నారు.

ఐదేళ్ల పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు

- డీఎంహెచ్‌వో కళావతిబాయి



కృష్ణకాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న కళావతిబాయి

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 4 : అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదు సంవత్సరాల వరకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌వో) బి.కళావతిబాయి సూచించారు. జిల్లా కేంద్రంలోని కృష్ణ కాలనీ సబ్‌సెంటర్, అంగన్‌వాడీ సెంటర్లను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఎం అండ్‌హెచ్‌వో మాట్లాడుతూ వ్యాక్సిన్ క్యారియర్‌లోని ఐస్‌బ్యాక్ కండీషన్ ఉన్నాయా..! లేవా?, వాడిన వ్యాక్సిన్..ఓపెన్ వాయల్ పాలసి చేశారా! లేదా? అని తెలుసుకున్నారు. వ్యాక్సిన్ వేస్తున్నప్పుడు రియాక్షన్ కాకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది ఎప్పటికప్పుడు టార్గెట్‌లు, అచివ్‌మెంట్‌లు పూర్తి చేయాలన్నారు. ఎండాకాలం వడగాలులు వీచే ప్రమాదముందని, ప్రజలు ఎండదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తర్వాత సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు.

హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు..

వడదెబ్బతో అస్వస్థతకు గురైన వారి కోసం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు డీఎం అండ్‌హెచ్‌వో కళావతిబాయి తెలిపారు. తీవ్రమైన ఎండల నేపథ్యంలో హెల్ప్‌లైన్ సెంటర్ ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. 24 గంటలు ఈ సెంటర్ పని చేస్తుందన్నారు. ఎవరైనా వడదెబ్బకు గురై అపస్మారక స్థితికి వెళ్లితే వెంటనే సెల్ : 96766 21992 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. తక్షణమే అం దుబాటులో ఉన్న అంబులెన్స్‌తో పాటు చికిత్స అందిస్తామని పేర్కొన్నారు.

దళారుల చేతిలో రైతులు మోసపోవద్దు

డీపీఎం నళినినారాయణ



వడ్డెకొత్తపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నళినినారాయణ

పెద్దవంగర, ఏప్రిల్ 3 : దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలని డీపీఎం నళినినారాయణ అన్నారు. పెద్దవంగర మండలంలోని బీసీ తండా, ఉప్పరగూడెం, కొరిపెల్లి, వడ్డెకొత్తపల్లి, బొమ్మకల్ గ్రామాల్లో బుధవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేసేందుకు ప్రణాళికలను రూపొందించారని, క్రయవిక్రయాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండాచూడాలని కోరారు. రైతులు పండించిన ధ్యానానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధ్యానం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. దళారులు ధాన్యం విక్రయించిన వెంటనే డబ్బులు ఇస్తామని చెప్పే మాయమాటలకు రైతులు మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీలు సుధాకర్, సుజాత, సుధాకర్, పద్మ, ఏఈవో యశస్విని, అనిల్ సోమ నర్సింహారెడ్డి, యాకన్న, హరికృష్ణ, సైదులు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కంబాలపల్లిలో..

- మహబూబాబాద్ రూరల్ : మండలంలోని కంబాలపల్లి, రెడ్యాల, ముడుపుగల్, అమనగల్, పర్వతగిరి, మల్యాల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు అడిషనల్ డీఆర్‌డీఏ జయశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారుల మాటలు నమ్మి, తూకంలో మోసపోయి ఆర్థాకంగా నష్టపోవద్దన్నారు. ప్రభుత్వ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని చెప్పారు. క్వింటా ఏ-గ్రేడ్ రకానికి రూ.2203, కామన్‌రకం ధాన్యానికి రూ.2183 ధర చెల్లించనున్నట్లు చెప్పారు. ఈ సదావకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఏవో తిరుపతిరెడ్డి, ఎంపీవో హరిప్రసాద్, ఏపీఎం తిలక్, సీసీలు శ్రీదేవి, ధనుంజయ్, సుమలత, ఏఈవో శ్రీనివాస్, సరిత, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

తుక్కుగూడ సభకు భారీగా తరలాలి

- కేంద్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారం
- ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్



ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 3 : తుక్కుగూడలో ఈనెల 6న కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరగబోయే జనజాతర బహిరంగసభకు భారీగా తరలివచ్చి, జయప్రదం చేయాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుక్కుగూడ బహిరంగసభకు భారీగా జనసమీకరణ చేయాలని సూచించారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగించి, కేంద్రంలో అధికారంలోకి రానుందని జోస్యం చెప్పారు. మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఉత్సాహంతో పని చేయాలని, కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. గుగులోతు దస్రూనాయక్, దేవరం ప్రకాశ్‌రెడ్డి, ఘనపురపు అంజయ్య, ఘంట సంజీవరెడ్డి, బండారు వెంకన్న, కదిరే సురేందర్, ఎడ్ల రమేష్, నిమ్మల శ్రీనివాస్, కత్తిస్వామి, మిట్టకంటి రాంరెడ్డి, పోతురాజు రాజు, పట్నం శెట్టి నాగరాజు, భూక్య శ్రీను పాల్గొన్నారు.

కమ్యూనిస్టు రాజ్యం రావాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న సాదుల శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 3 : నిరుపేదలకు న్యాయం జరగాలంటే కమ్యూనిస్టు రాజ్యం రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. మానుకోటలోని పెరుమాండ్ల జగన్నాథంభవన్‌లో సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గాయత్రిగుట్ట మల్లుస్వరాజ్యం నగర్‌కాలనీ, కురవిగేట్ సమీపంలోని గుడిసెవాసులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కమ్యూనిస్టు పార్టీతోనే సాధ్యమని చెప్పారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు గడిచినప్పటికి పేదవాడు పేదవాడిగా మిగిలిపోతున్నారని, ధనవంతులు మరింత సంపదను పోగేసుకుంటున్నారని ఆరోపించారు. దేశ సంపద ప్రజలందరికి సమానంగా దక్కాలంటే కమ్యూనిస్టు రాజ్యం రావాలని అప్పుడే సమస్త మానవాళికి విముక్తి కలుగుతుందన్నారు. పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య, అల్లి శ్రీనివాస్‌రెడ్డి, రావుల రాజు, యమగాని వెంకన్న, తోట శ్రీనివాస్, బానోత్ వెంకన్న, బూర్గుల లక్ష్మణ్, ప్రకాశ్, శ్రీరాం, మోతీలాల్, వీరేష్, సునిత, విజయలక్ష్మి, అన్వేష్ పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా ప్రజలను చైతన్య పర్చాలి

మానుకోట మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్



సమావేశంలో మాట్లాడుతున్న నోముల రవీందర్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 3 : వేసవి ఎండలు తీవ్రతరం కావడంతో ప్రజలు ఎండదెబ్బకు గురికాకుండా వారిని చైతన్యపర్చాలని మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్ సూచించారు. జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాలతో మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో బుధవారం వైద్యఆరోగ్య, రెవెన్యూ, పోలీస్, మునిసిపల్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని సూచించారు. మహబూబాబాద్ మండల పరిధిలో ఉన్న కంబాలపల్లి, మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ పీహెచ్‌సీ సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్‌టాబ్లెట్లు అందుబాటులో ఉంచి ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్ల ద్వారా ప్రజలకుఉచితంగా అందించాలన్నారు. వేసవి రెండు నెలల పాటు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు జాగ్రత్తలు వివరించాలన్నారు. వైద్యులు సుధీర్‌కుమార్, విజయ్‌కుమార్, మౌనిక. వొబిలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

బాలల వివరాలను వెల్లడించడం నిషేధం

- సీడబ్ల్యూసీ జిల్లా చైర్‌పర్సన్ నాగవాణి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 3 : బాలల గుర్తింపును వెల్లడి చేయడం నిషేధమని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) జిల్లా చైర్‌పర్సన్ నాగవాణి బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఏదైనా సంఘటనలో బాధిత అమ్మాయి పేరు, కుటుంబ వివరాలను పత్రికల్లో ప్రచురించవద్దన్నారు. సెక్షన్ 74 జేజే యాక్ట్ 2015 ప్రకారం 0-18 సంవత్సరాలు ఉన్న బాధిత పిల్లలపేర్లు, వారి యొక్క కుటుంబవివరాలను తెలియపరచవద్దన్నారు. పిల్లల వివరాలను గోప్యంగా ఉంచాలని భంగం కలిగించినచో వారిపై సెక్షన్ 74 జేజే యాక్ట్ 2015 ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకోబడుతాయని నాగవాణి తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికలకు అసెంబ్లీ సెగ్మెంట్ కాంగ్రెస్ సమన్వయ్యకర్తల నియామకం

- వెల్లడించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్



వెన్నం శ్రీకాంత్‌రెడ్డి




బండి సుధాకర్‌గౌడ్

మహబూబాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసి, విజయం సాధించేందుకు రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తలను నియమించింది. ఈ మేరకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ బుధవారం ప్రకటించారు. ఇప్పటికే తెలంగాణలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు రాష్ట్ర మంత్రులను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. అందు లో మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఎంపిక చేశారు. తాజాగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించగా.. అందులో భాగంగా మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు సమన్వయకర్తలను నియమించింది. మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్, ఇల్లందుకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, డోర్నకల్‌కు ఘంట సంజీవరెడ్డి, జూలకంటి సీతారాంరెడ్డి, నర్సంపేటకు డాక్టర్ పులిఅనిల్‌కుమార్, ములుగుకు కె.రవళిరెడ్డి, పినపాకకు మోత్కూరి ధర్మారావు, దారావత్ రాంమూర్తినాయక్, జి.గోపి, భద్రాచలానికి నల్లపు దుర్గాప్రసాద్, సత్యనారాయణ చౌదరిలను నియమించారు. వీరు వారికి కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమన్వయకర్తలుగా వ్యవహరించనున్నారు.

'వరంగల్'పై బీఆర్ఎస్ గురి!

- బలమైన అభ్యర్థిని నిలిపేందుకు తీవ్ర కసరత్తు
- రోజురోజుకు పెరుగుతున్న ఆశావహుల సంఖ్య
- నేతలకు సవాల్‌గా మారిన ఎంపిక
- ప్రత్యేక దృష్టి పెట్టిన కేసీఆర్, హరీష్‌రావు
- పరిశీలనలో పెద్ది స్వప్న, తాటికొండతో పాటు ఐదారుగురి పేర్లు
- సామాజిక సమీకరణలపై లెక్కలు వేస్తున్న అధినాయకత్వం



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

వరంగల్ ఎంపీ అభ్యర్థి ఎంపికను సవాల్ తీసుకున్న బీఆర్ఎస్‌కు.. బలమైన అభ్యర్థిని బరిలో దించి విజయంపై గురి పెట్టింది. అయితే కాంగ్రెస్, బీజేపీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు బీఆర్ఎస్ నుంచి వలస వెళ్లిన నేతలే కావటంతో.. వారిని ఢీకొట్టే నేతనే ఎంపిక చేసే దిశగా అధినాయకత్వం కసరత్తు చేస్తోంది. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి నైరాశ్యంలో ఉన్న గులాబీ శ్రేణుల్లో కడియం ఎపిసోడ్ కసిని పెంచగా.. వరంగల్ స్థానంలో తమ సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఈ క్రమంలో పలువురు నేతలు వరంగల్ బరిలో నిలిచేందుకు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. వరంగల్ సీటును చాలెంజ్‌గా తీసుకున్న గులాబీ నేతలు బలమున్న నేత కోసం అన్వేషిస్తున్నారు. స్థానికేతర నేతలు కూడా వరంగల్ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తుండటంతో సీటు ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ గులాబీ పార్టీలో నెలకొంది.

అభ్యర్థి ఎంపికపై కసరత్తు...

వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి బలమైన అభ్యర్థిని బరిలో దించాలనే ఆలోచనలో బీఆర్ఎస్ అధిష్ఠానం ఉంది. ఇప్పటికే కీలకమైన నేతలు కాంగ్రెస్, బీజేపీల్లోకి వెళ్లారు. అయితే నాయకులు పోయినంత మాత్రాన కేడర్ వెళ్లదని గులాబీ నేతలు నమ్ముతున్నారు. దీంతో పాటు కడియం శ్రీహరి ఎపిసోడ్‌ను ఎన్నికల అస్త్రంగా మలుచుకుని ఓట్ల వేటలో దిగాలనే ఆలోచనలో గులాబీ నేతలున్నారు. ఒకటో తేదీన వరంగల్ పర్యటనకు వచ్చిన హరీష్‌రావు ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో అభ్యర్థి ఎంపికపై చర్చించారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి, వరంగల్ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న పేరును కొందరు నేతలు హరీష్‌రావు దృష్టికెళ్లారు. అయితే జనగామ ఎమ్మెల్యేతో పాటు మరికొందరు నేతలు మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యను పోటీలో దించేతే టఫ్ ఫైట్ ఉంటుందని సూచించారు. వీరితో పాటు తెలంగాణ ఉద్యమకారులైన జోరుక రమేష్, బోడా డిన్నా, సిరిమిల్ల సదానందం, నిరంజన్ తదితరులు కూడా టికెట్ ఆశిస్తున్నారని హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఉద్యమకారులకు భవిష్యత్తు మంచి అవకాశాలు కల్పిస్తామని, ఈసారి వరంగల్ ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకుంటున్నామని, అంగ బలంతో పాటు ఆర్థికంగా బలమైన నేతను బరిలో దించాలని అధిష్ఠానం ఆలోచనగా హరీష్‌రావు చెప్పినట్లు సమాచారం. మరోవైపు మాజీ సీఎం కేసీఆర్ సైతం వరంగల్‌పై ఫోకస్ చేశారు. మంగళవారం నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిలతో ఫోన్‌లో మాట్లాడి.. టికెట్ విషయమై చర్చించినట్లు సమాచారం. అయితే స్థానికేతరులైన మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, బాల్క సుమన్ కూడా వరంగల్ టికెట్ అడుగుతున్నట్లు తెలుస్తుండగా.. వరంగల్ స్థానం నుంచి పోటీ చేసిన స్థానికేతరులు ఇప్పటి వరకు ఎవరు గెలువలేదని, స్థానికులకే టికెట్ ఇవ్వాలని వరంగల్ జిల్లా ప్రతినిధులు కేసీఆర్‌ను కోరినట్లు తెలిసింది. దీంతో ఒకటి రెండు రోజుల్లో వరంగల్ అభ్యర్థిని ఖరారు చేస్తామని కేసీఆర్ నేతలకు హామీ ఇచ్చినట్లుగా తెలిసింది. మొత్తానికి పెద్ది స్వప్న లేదంటే తాటికొండ రాజయ్యలల్లో ఒక్కరు టికెట్ పక్కా అనే చర్చ గులాబీ పార్టీ నేతల నుంచి వినిపిస్తోంది.

కుల సమీకరణలపై ఫోకస్..

వరంగల్ ఎంపీ స్థానం ఎస్సీ రిజర్వుడు కావటంతో కుల సమీకరణలపై గులాబీ పార్టీ లెక్కలు వేస్తోంది. 18లక్షలకు పైగా ఓట్లున్న వరంగల్ పార్లమెంట్ పరిధిలో దళితుల ఓట్లు సుమారు ఐదు లక్షల వరకు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా మాదిగ సామాజిక వర్గం ఓట్లే, ఆ తరువాత మాల సామాజిక

మిగతా 8వ పేజీలో

కడియం ఎపిసోడ్‌తో శ్రేణుల్లో పెరిగిన కసి..

తెలంగాణ ఉద్యమానికి మొదటి నుంచి వెన్నుదన్నుగా ఉన్న వరంగల్‌లో 2014, 2016ఉప ఎన్నికతో పాటు 2019లో వరుసగా మూడుసార్లు బీఆర్ఎస్ గెలిచింది. దీంతో వరంగల్‌లో కొద్దిగా కష్టపడితే గెలిచే అవకాశం ఉందని బీఆర్ఎస్ భావిస్తోంది. ఈ సమీకరణలతోనే మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్యకు మార్చి 13న టికెట్ ఖరారు చేశారు. అయితే అనూహ్యంగా కావ్య బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరటం, ఆ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా ప్రకటన రావటం చకచకా జరిగిపోయాయి. దీంతో గులాబీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల హన్మకొండలో జరిగిన బీఆర్ఎస్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో కార్యకర్తలు కడియం తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కడియం పార్టీకి వెన్నుపోటు పొడిచారనే భావనలో గులాబీ శ్రేణులున్నాయి. దీంతో వచ్చే ఎన్నికల్లో కడియంపై ప్రతీకారం కోసం బీఆర్ఎస్ కార్యకర్తలు కదనోత్సహంతో ఉన్నట్లుగా ఆ సమావేశంలో వ్యక్తమైంది. గత అసెంబ్లీ ఎన్నిల్లో ఓడిపోయి నైరాశ్యంలో ఉన్న గులాబీ కార్యకర్తలకు కడియం ఎపిసోడ్ బూస్టింగ్ ఇచ్చిందనే చర్చ జరుగుతోంది. దీనికి తోడు వరంగల్ ఎంపీ సీటుపై మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఈ క్రమంలోనే కేడర్‌లో జోష్ నింపేందుకు గత ఆదివారం జనగామ జిల్లాలోని దేవరుప్పుల మండలంలో వరి పంటలను పరిశీలించేందుకు కేసీఆర్ పర్యటించగా, మరుసటి రోజు సోమవారం మాజీ మంత్రి హరీష్‌రావు కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికలకు కేడర్‌ను సన్నద్ధం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కీలక నేతల పర్యటనలతో శ్రేణుల్లో జోష్ కనిపించడంతో పాటు కడియం శ్రీహరి ఎపిసోడ్‌తో మనస్తాపం చెందిన కార్యకర్తలు మరింత కసితో పనిచేసి గులాబీ జెండా ఎగురవేస్తామంటూ సవాళ్లు విసురుతున్నారు.

పీపుల్స్‌వార్ బారి నుంచి కడియంను కాపాడింది నేనే..

● ఇతరుల ఎదుగుదలను ఓర్వలేని వ్యక్తి ● శ్రీహరి కడియం మాదిగ వ్యతిరేకి
● లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకే సంపూర్ణ మద్దతు ● ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

వడ్డెపల్లి, ఏప్రిల్ 3: చంద్రబాబు నాయుడి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సందర్భంగా జిల్లాలో ఎన్‌కౌంటర్లు జరుగుతున్న సమయంలో కడియం శ్రీహరిని పీపుల్స్ వార్ టార్గెట్ చేస్తే అతడిని కాపాడింది తానేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. పీపుల్‌వార్ దగ్గర తుపాకుల ఉంటే తమ వద్ద డప్పులు ఉన్నాయని చెప్పి కడియం శ్రీహరి ప్రాణానికి ముప్పు వాటిల్లకుండా చూసింది తానేనన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంద కృష్ణ మాదిగ మాట్లాడారు.

అవకాశవాద రాజకీయాలు కడియం శ్రీహరికి అలవాటేనని, ఇతరుల ఎదుగుదలను ఓర్వలేని వ్యక్తి అని దుయ్యబట్టారు. మోసం, కక్షపూరిత చర్యలు ఆయన నైజమని అన్నారు. దళిత సమాజానికి శ్రీహరి చేసింది శూన్యమేనని, తన ఎదుగుదలకే మాదిగ సామాజిక వర్గాన్ని వాడుకున్నాడని ఆరోపించారు. టీడీపీలో మంత్రిగా ఉన్నప్పుడు దళితుడైన మోత్కుపల్లి నర్సింహులును, బీఆర్ఎస్‌లోకి వచ్చిన తర్వాత డాక్టర్ తాటికొండ రాజయ్య, అరూరి రమేశ్, ఎంపీ పసునూరి దయాకర్‌లను ఎదుగకుండా కుట్ర చేసిన ఘనత కడియం శ్రీహరికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌లో డిప్యూటీ సీఎం, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేగా పదవులను అనుభవించిన కడియం శ్రీహరి.. ఆ పార్టీకే ద్రోహం చేసి కాంగ్రెస్‌లో చేరారని అన్నారు. కాంగ్రెస్‌లోకి వచ్చిన తర్వాత సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్‌కు, కాంగ్రెస్ సీనియర్ నేతలు దొమ్మటి సాంబయ్య, సింగపురం ఇందిర, డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, డాక్టర్ పరంజ్యోతి తదితరులు వరంగల్ లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్‌పార్టీ నుంచి ఆశిస్తే తన కూతురైన కడియం కావ్యకు టికెట్ ఇప్పించుకొని వారి ఆశలపై నీళ్లు చల్లారని మంద కృష్ణ మాదిగ విమర్శించారు.

తాను దళిత ముసుగు తీసేసి బీజేపీలో చేరానని కడియం శ్రీహరి చెప్పడం విడ్డూరంగా ఉందని మంద కృష్ణ మాదిగ అన్నారు. తాను 30 ఏళ్లుగా దండోరా ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తూ దళిత సామాజిక వర్గం సమస్యలతో పాటు ఇతరుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నానని తాను అప్పటినుంచి ఇప్పటివరకు ఒకే కండువా వేసుకుంటున్నానని అన్నారు. కడియం శ్రీహరి తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో కండువాలను మార్చాడని కృష్ణ మాదిగ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నాలుగు శాతం ఉన్న రెడ్లకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆరు లోక్‌సభ స్థానాలను ఇప్పటికే కేటాయించిందని మందకృష్ణ మాదిగ అన్నారు. 50 శాతం ఉన్న బీసీలకు రెండు స్థానాలే కేటాయించి, 25 శాతం ఉన్న మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించలేదని, అదే రెండు, మూడు శాతం ఉన్న మాలలకు రెండు లోక్‌సభ స్థానాలు కేటాయించిదని పేర్కొన్నారు. మాదిగ ఉప కులమైన బైండ్ల సామాజిక వర్గం ఊరికొక్క కుటుంబ కూడా లేకున్నప్పటికీ ఒక్క లోక్‌సభ స్థానం కేటాయించి మాదిగలకు కాంగ్రెస్ పార్టీ మొండి చేయి చూపిందని మంద కృష్ణ మాదిగ ఆరోపించారు.

మాదిగ సమాజం భవిష్యత్తు కోసం, ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రకటించిన నరేంద్రమోదీని మూడోసారి ప్రధాని చేయడం కోసం లోక్‌సభ ఎన్నికల్లో తాము బీజేపీకి సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్లు మంద కృష్ణ మాదిగ తెలిపారు. మాదిగ సమాజమంతా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని బలపర్చాలని ఆయన కోరారు. వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని కడియం కావ్యను చిత్తుగా ఓడించాలని మాదిగలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ, ఎంఎస్‌పీ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న కాపు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్, జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంద రాజు, రాష్ట్ర, జిల్లా నాయకులు జన్ను దినేష్, బొక్కల నారాయణ మాదిగ, కొయ్యడ మల్లేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి

మంద కృష్ణ బీజేపీ ఏజెంట్

బీఆర్ఎస్ పరోక్షంగా బీజేపీకి మద్దతు ● కావ్య గెలుపునకు సీపీఐ నాయకులు సహకరించాలి
కాంగ్రెస్ వరంగల్ లోక్‌సభ ఇన్‌చార్జి రేవూరి ప్రకాశ్‌రెడ్డి ● సీపీఐ మద్దతు కోరిన కడియం శ్రీహరి

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 3: మంద కృష్ణ తన వర్గ ప్రయోజనాల కోసం పోరాడకుండా బీజేపీకి ఏజెంట్‌గా మారి మాదిగలకు ద్రోహం చేయాలని చూస్తున్నాడని కాంగ్రెస్ వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి రేవూరి ప్రకాశ్‌రెడ్డి బుధవారం హనుమకొండలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఇండియా కూటమిలో ఉన్న సీపీఐ నాయకుల మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడారు.

దేశంలో రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పడగొట్టాలన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పదేళ్లలో దేశ ఆర్థిక వనరులను కార్పొరేట్, పెట్టుబడిదారులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకుందని, హిందూత్వ వాదం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తోందన్నారు. మరోవైపు దళితులు, మైనారిటీ వర్గాలపై దాడులు పెరిగాయని, ఈ క్రమంలోనే దేశంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం సహా ప్రాంతీయ పార్టీలతో ఇండియా కూటమిగా ఏర్పడిందన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిలో ఉన్న సీపీఐ నాయకులు కడియం కావ్య గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు పరోక్షంగా బీజేపీ పార్టీకి మద్దతు పలుకుతున్నారని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి బీజేపీ బీఆర్ఎస్‌ల ఎత్తుగడలను చిత్తు చేయాలని రేవూరి కోరారు.

పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తాం..

రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు పని చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు తెలిపారు. బీజేపీ పాలనలో పదేళ్లలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజల జీవితాలపై పెనుభారం మోపిందన్నారు. తమ ప్రధాన లక్ష్యం బీజేపీ ఓటమేనని, బీజేపీకి వంత పాడుతున్న బీఆర్ఎస్‌ను కూడా వచ్చే లోక్‌సభ ఎన్నికలలో ఓడిస్తామన్నారు. ఇండియా కూటమి అభ్యర్థిగా కడియం కావ్యకు టికెట్ వచ్చిన నేపథ్యంలో కావ్య గెలుపునకు కృషి చేస్తామన్నారు. సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.విజయసారథి, నేదునూరి జ్యోతి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి, వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, నాయకులు బీఆర్ లెనిన్, పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, షేక్ బాషుమియా, పి.సుగుణమ్మ, మద్దెల ఎల్లేష్, తోట బిక్షపతి, కొట్టెపాక రవి, తదితర సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీతో కాంగ్రెస్ లోపాయికారి ఒప్పందం

కరీంనగర్‌కు ఎంపీ బండి సంజయ్ చేసిన అభివృద్ధి శూన్యం
కరీంనగర్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కమలాపూర్ (ఎల్కతుర్తి), ఏప్రిల్ 3: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీజేపీతో లోపాయికారి ఒప్పందం పెట్టుకోవడం వల్లనే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థినైన తాను ఓటమి పాలయ్యానని కరీంనగర్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ఆరోపించారు. బుధవారం కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామంలో ఓ శుభకార్యానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. 2019లో జరిగిన కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ రాలేదన్నారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కి కాంగ్రెస్ మద్దతు ఇచ్చి గెలిపించుకున్నారన్నారు. ఇప్పుడు కూడా ఆదే ధోరణి అవలంబిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థిని కాంగ్రెస్ ఖరారు చేయకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఎన్ని పార్టీలు ఏకమైనా కరీంనగర్‌లో ఈసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు.

ఎంపీగా బండి సంజయ్ కరీంనగర్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమని వినోద్‌కుమార్ అన్నారు. ఉప్పల్ రైల్వే బ్రిడ్జిని తాను ఎంపీగా మంజూరు చేయిస్తే 5 ఏండ్ల పాలనలో బండి సంజయ్ ఎంపీగా కనీసం ట్రాక్‌పై బ్రిడ్జి పనులను పూర్తి చేయించలేదని ఎద్దేవా చేశారు. అభివృద్ధి పనులపై చర్చించే జడ్పీ సమావేశానికి బండి తన పదవీ కాలంలో ఒక్కసారి కూడా హాజరుకాలేదన్నారు. పార్టీ కోసం తప్ప బండి సంజయ్ ప్రజల కోసం ఏనాడూ పనిచేయలేదని విమర్శించారు. జాతీయ రహదారుల పనులను తాను ఎంపీగా ఉన్నప్పుడు తీసుకువచ్చానన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను చూపించి అవి తానే తీసుకవచ్చానని చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. సాగునీరు లేక చేతికందే సమయంలో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును మరమ్మతులు చేయించలేక కేసీఆర్‌ను బదునాం చేసే పనిలో పడ్డారని దుయ్యబట్టారు. ఎస్సారెస్పీ కాలువ ద్వారా ఆయకట్టు చివరివరకు నీరందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులు పండించిన వరి ధాన్యానికి ఎంఎస్‌పీ ధరపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించాలని వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించి ఓట్లు దండుకున్నారని ఆరోపించారు. తాను ప్రజల పక్షాన నిలబడి యావత్ తెలంగాణ సమస్యలపై పార్లమెంట్‌లో కొట్లాడుతానని పేర్కొన్నారు. ఎంపీగా ఆదరించి లోక్‌సభకు పంపాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ తడక రాణి శ్రీకాంత్, జడ్పీటీసీ లాండిగే లక్ష్మణ్‌రావు కళ్యాణి, సింగిల్ విండో చైర్మన్ పేరాల సంపత్‌రావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎర్రం ఇంద్రసేనారెడ్డి, మాజీ జడ్పీటీసీ మారెపల్లి నవీన్‌కుమార్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, ఉప్పల్ తాజా మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్‌రావు, ఎంపీటీసీ తూర్పాటి ఆరుణ క్రాంతి కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యలపై ఫిర్యాదు చేయండి..

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

7207908583 నెంబర్‌లో సంప్రదించాలని ఆదేశం

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 3: నగర పాలక సంస్థ పరిధిలో ఇకపై నీటి సమస్యలు, సందేహాలు ఉంటే తమకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బల్దియా పరిధిలో ఇకపై నీటి సమస్యల కోసం ప్రత్యేక ఫోన్ 7207908583 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. 66 డివిజన్‌ల పరిధిలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు నీటి సరఫరా జరిగే సమయాల్లో ఏదైనా ఇబ్బందులు ఏర్పడితే ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూసారని తెలిపారు.

కాంగ్రెస్ 'అసెంబ్లీ' కో ఆర్డినేటర్ల నియామకం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 3: వరంగల్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లకు కో-ఆర్డినేటర్లను టీపీసీసీ నియమించింది. ఈ మేరకు బుధవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ నియామకాలను అధికారికంగా ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కో-ఆర్డినేటర్లు బాధ్యతలు నిర్వహిస్తారు.

స్టేషన్ ఘన్‌పూర్ : పింగిళి వెంకట్‌రెడ్డి
వర్ధన్నపేట : కుందురు వెంకట్‌రెడ్డి
పాలకుర్తి : పాలడుగు పద్మ
పరకాల : బి.అశోక్‌రెడ్డి
వరంగల్ పశ్చిమ : ఆరోహి సంగీత
వరంగల్ తూర్పు : జాలి కమలాకర్‌రెడ్డి
భూపాలపల్లి : మార్కం విజయ్‌కుమార్

'ప్రేరణ' కలిగించేలా..

విద్యార్థుల కోసం వినూత్న కార్యక్రమం ● 9 నుంచి 12వ తరగతి వారికి అవకాశం
ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల వారూ అర్హులే ● 15వ తేదీ వరకు దరఖాస్తు గడువు



వాద్‌నగర్‌లోని మ్యూజియం

జనగామ కల్చరల్, ఏప్రిల్ 3: వేసవి సెలవుల్లో విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టి వారిలోని సృజనాత్మకతను వెలికితీయాలే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా 'ప్రేరణ' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తొమ్మిది నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసింది. ఇందు కోసం ఈ నెల 1 నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తోంది. ప్రతీ పాఠశాల నుంచి విద్యార్థులు ఇందులో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని అధికారులు సూచిస్తున్నారు. ఎంపికైన విద్యార్థులకు గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో శిక్షణ ఇస్తారు.

ముందుగా రిజిస్ట్రేషన్

ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో వచ్చే విద్యా సంవత్సరంలో 9 నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులు ఆన్‌లైన్ లో ప్రేరణ డాట్ ఎడ్యుకేషన్ డాట్ గవ్ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ నెల 15 వరకు ఇందుకు అవకాశం ఉంది. ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

ఎంపిక ఇలా..

విద్యార్థులకు వికసితభారత్/సమాజం, దేశ అభివృద్ధికి నా సహకారం - పాత్ర అనే అంశాలపై వ్యాస రచన, కవితలు, కథలు, పాటలు రాయడం, పెయింటింగ్, కార్టూన్స్ పోటీలు నిర్వహిస్తారు. పాఠశాల స్థాయి ప్రేరణ ఉత్సవ్‌లో మొదటి స్థానంలో నిలిచిన ఒక బాలిక, ఒక బాలుడిని ఎంపిక చేసి వారిద్దరి పేర్లు ప్రేరణ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలి. ఆ వివరాలను జిల్లా విద్యాశాఖాధికారికి కూడా సమర్పించాలి. పాఠశాల నుంచి ఇద్దరు చొప్పున రిజిస్ట్రేషన్ చేసుకున్న అనంతరం వారికి విద్యాశాఖ సహకారంతో శిక్షణ నిర్వహిస్తారు. అందుకు కావలసిన ఖర్చులను కాంపోజిట్ పాఠశాల గ్రాంటు నిధుల నుంచి ఉపయోగించుకోవాలి.

జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవ్

వరంగల్‌లోని జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తూ జిల్లా స్థాయి ప్రేరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తారు. జిల్లా లోని అన్ని పాఠశాలల నుంచి ఎంపికైన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. 'ప్రేరణ కార్యక్రమానికి నన్ను ఎందుకు ఎంపిక చేయాలి / దేశం పట్ల నా వైఖరి, వికసిత భారత్ ఎట్ ది రేట్ 2047' అనే అంశాల పై విద్యార్థులకు వ్యాస రచన, కవితలు, కథలు, పాటలు రాయడం, పెయింటింగ్, కార్టూన్స్ పోటీలు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన ఒక బాలిక, ఒక బాలుడు ప్రేరణ కార్యక్రమంలో పాల్గొనడానికి అర్హులు. ఎంపికైన బాలిక యొక్క పాఠశాలకు చెందిన ఒక ఉపాధ్యాయురాలిని గైడ్ టీచర్‌గా పై కార్యక్రమానికి ఎంపిక చేస్తారు.

ప్రయోజనాలు

భారతీయ వసుధైక కుటుంబం, భిన్నత్వంలో ఏకత్వం, మన సాంస్కృతిక వారసత్వం - విలువలు, స్ఫూర్తివంతమైన భారతీయ నాయకుల గురించి విద్యార్థులు తెలుసుకుంటారు. తద్వారా దేశ నిర్మాణానికి తోడ్పడతారు. దృఢమైన నమ్మకంతో శక్తివంతమైన నాయకత్వ లక్షణాలను అనుభవపూర్వకమైన అభ్యాసం ద్వారా అలవర్చుకుంటారు. తద్వారా దేశ ప్రగతికి నిర్మాణాత్మకంగా కృషి చేస్తారు. విద్యార్థులు నైతికతను, ప్రేరణను, సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకుంటారు.

ఏమిటీ వాద్‌నగర్ ప్రత్యేకత

ఇది గుజరాత్ రాష్ట్రంలోని మెహ్సానా జిల్లాలో ఉంది. వాద్‌నగర్ లోని వెర్నాక్యులర్ స్కూల్‌లో భారత ప్రధాని మోదీ విద్యాభ్యాసం జరిగింది. ఈ పాఠశాల 1818 నుంచి 2018 వరకు కొనసాగింది. ప్రస్తుతం ఈ పాఠశాలను ఆర్కియాలాజికల్ మ్యూజియంగా మార్చారు. జిల్లాల నుంచి ఎంపికైన ఇద్దరిని ఈ శిక్షణకు పంపిస్తారు. ఇలా దేశ వ్యాప్తంగా 10 జిల్లాలను ఎంపిక చేసి వీరిని ఒక బ్యాచ్ గా వ్యవహరిస్తారు. వాద్‌నగర్ మ్యూజియంలో 8 మంది మెంటార్లు వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులను ఒకచోట చేర్చి (బ్యాచ్) వారం రోజుల పాటు వారికి అన్ని రకాల నాగరికతలను పరిచయం చేస్తారు. ఇందులో ఐదు రోజులు నిపుణుల ప్రసంగాలు, రెండు రోజుల పాటు క్షేత్ర సందర్శన ఉంటుంది. అనంతరం వీరిని రాయబారులుగా పరిగణిస్తారు.

ప్రేరణ కార్యక్రమ పాఠ్యాంశాలు

1. భారతీయ దేశీయ విజ్ఞానం
2. సాంకేతిక - సృజనాత్మకత
3. స్ఫూర్తిదాయకమైన భారతీయ నాయకులు
4. క్షేత్ర సందర్శనలు
5. యోగా & మెడిటేషన్

విషయ ఆధారిత అంశాలు

1. స్వాభిమానం & వినయం
2. శౌర్యం & సాహసం
3. పరిశ్రమ & సమర్పణం
4. కరుణ & సేవ
5. వైవిధ్యం & ఏకత్వం
6. సత్యనిష్ఠ & శుచితా
7. నవాచారం & జిజ్ఞాస
8. శ్రద్ధ & విశ్వాసం
9. స్వతంత్రత & కర్తవ్యం

ప్రేరణ కార్యక్రమం లక్ష్యాలు

నేను ఎవరు ?
నా దేశ చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఏమిటి?
నా దేశం కోసం నేను ఏమి చేయగలను?
పై విషయాలపై విద్యార్థులు అన్వేషించడానికి ఈ కార్యక్రమం అవకాశాలను సృష్టిస్తుంది.

ప్రతీ పాఠశాల భాగస్వామ్యం ఉండాలి..

బొమ్మనబోయిన శ్రీనివాస్, ఏంఈవో



ప్రేరణ కార్యక్రమంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలి. ఇందులో ప్రతీ పాఠశాల భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాల స్థాయిలో ఎంపిక అనంతరం జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తాం. అందుకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించాం.

భవిష్యత్‌కు ఎంతో ఉపయుక్తం

కె.రాము, డీఈవో, జనగామ



తొలిసారిగా కేంద్ర విద్యాశాఖ ప్రవేశపెట్టిన ప్రేరణ కార్యక్రమంలో ప్రతీ పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థుల పేర్లు ఆన్‌లైన్ లో నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించాం. ఇది విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయుక్తంగా ఉంటుంది.

తాగునీటి సరఫరా పర్యవేక్షణకు ప్రత్యేకాధికారి

ఉమ్మడి వరంగల్ జిల్లాకు బి.గోపి నియామకం

త్వరలో జిల్లాల్లో పర్యటన.. కలెక్టర్లతో సమీక్ష సమావేశాలు

హనుమకొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తాగునీటి ఎద్దడి ప్రమాదం ముంచుకొస్తుండడంతో అప్రమత్తమైన రాష్ట్రప్రభుత్వం జిల్లాలో తాగునీటి సరఫరా పర్యవేక్షణకు గాను ఉమ్మడి జిల్లాకు ప్రత్యేకాధికారిని నియమించింది. రాష్ట్ర వ్యవసాయ సంచాలకుడు గోపిని నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన త్వరలో హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ జిల్లాల్లో పర్యటించి తాగునీటి పరిస్థితిని పరిశీలిస్తారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి నిరంతర సరఫరాకు చేసిన ఏర్పాట్లపై ఆయా జిల్లాల కలెక్టర్లతో సమీక్షలు నిర్వహిస్తారు. నీటి ఎద్దడి నివారణకు తీసుకోవలసిన చర్యలపై ప్రత్యేకాధికారి రాష్ట్ర ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదికలు పంపుతారు. అవసరాన్ని బట్టి ఆమేరకు ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుంది. ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా గోపి జూలై నెలాఖరు వరకు కొనసాగుతారు.

ఎన్నికల్లో పీవో, ఏపీవోలది ముఖ్యభూమిక

- అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, డేవిడ్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 3 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రిసైడింగ్ ఆఫీసర్ (పీవో), అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఏపీవో)లది ముఖ్యభూమిక ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పీవో, ఏపీవోల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పీవోలు, ఏపీవోల కీలక భూమిక పోషించాల్సి ఉంటుందన్నారు. అందుకోసం ఎన్నికల నిబంధనలు, హ్యాండ్ బుక్‌ద్వారా మాస్టర్ ట్రైనర్స్ తెలిపిన సూచనల ప్రకారం పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఏమైనా సమస్యలు, సందేహాలు, సూచనల కోసం మాస్టర్ ట్రైనర్స్ ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. మూడు రోజుల శిక్షణ తరగతులుఉదయం, మధ్యాహ్నం ఆరు సెషన్ల ద్వారా 2028 మంది సిబ్బందికి శిక్షణకు కేటాయించగా అందులో 1921 మంది హాజరయ్యారని, వివిధ కారణాలతో 107 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈవీఎంల పనితీరు, పోలింగ్ కేంద్రంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవసరమైన ఏర్పాట్ల గూర్చి మాస్టర్ ట్రైనర్స్‌చే శిక్షణ ఇప్పించడం జరిగిందన్నారు. మాస్టర్ ట్రైనర్స్ ప్రవీణ్, రాములు, అప్పారావు పాల్గొన్నారు.

బొడ్రాయి పునఃప్రతిష్ఠ వేడుకలు



బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన వేడుకలో పాల్గొన్న ఎంపీ మాలోతు కవిత

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 3 : రెడ్యాలలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన, ముత్యాలమ్మకు బోనాలు, ఆంజనేయస్వామి జలాభిషేకం లాంటి కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమానికి మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంపీ మాలోతు కవితను శాలువాతో సత్కరించారు. గ్రామస్తులు వెంకటేశ్వర్లు, నారాయణ, కిరణ్, నూకల రవి, వెంకటయ్య పడిగె ముసలయ్య, రవికిరణ్, శ్రీనివాస్,సురేందర్, ఎంపీటీసీ చింతల లలితసైదులు, బొడ్డుపల్లి ఉపేందర్, కామ సంజీవరావు, నల్లు సుధాకర్‌రెడ్డి, బండారు రమణ పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 3 : మాదిగలను అవమానించిన కాంగ్రెస్ పార్టీని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భూస్థాపితం చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్ మాదిగ అన్నారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈకార్యక్రమంలో కత్తుల రేణుక, ఎండీ. పాషా, కందిపాటి బిక్షపతి, రమేష్, వెంకన్న, రజిత, మంద సావిత్రి, పులి సోమయ్య పాల్గొన్నారు.

బస్‌షెల్టర్‌లు లేక ప్రయాణికుల అవస్థలు

● ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బందులు

నెల్లికుదురు, ఏప్రిల్ 3 : మండలంలోని వివిధ గ్రామాల స్టేజీల వద్ద బస్సుషెల్టర్‌లు లేకపోవడంతో ప్రయాణికులు ఎండకు ఎండివానకు తడుస్తున్నారు. తొర్రూరు నుంచి మహబూబాబాద్ వరకు అన్నిగ్రామాలకు స్టేజీలు దూరంగా ఉన్నాయి. నెల్లికుదురు, చిన్ననాగారం గ్రామాలు మాత్రమే ప్రధాన రోడ్ల వెంబడి ఉన్నాయి. మిగతా ఊళ్ల ప్రధాన రోడ్డుకు 2 నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఆర్టీసీ బస్సు ఎక్కాలంటే రెండు కిలోమీటర్ల దూరం నడిచి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. నెల్లికుదురు నుంచి మహబూబాబాద్ వైపు మధనతుర్తి, శ్రీరామగిరి, రావిరాల, బంజర స్టేజీల వద్ద మాత్రమే బస్‌షెల్టర్లు ఉన్నాయి. ఆ బస్‌షెల్టర్లు శిథిలావస్థకు చేరి కూలిపోయే దశకు చేరుకున్నాయి. రామన్నగూడెం, నైనాల, పార్వతమ్మగూడెం, మునిగలవీడు ఆలేరు, వావిలాల, వస్రాంతండా, తారసింగ్‌బావి, రత్తిరాంతండా స్టేజీలవద్ద బస్‌షెల్టర్లు లేకపోవడంతో వేసవి, వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణికులు బస్సుల కోసం ఎండలోనే నిరీక్షించవలసిన పరిస్థితి నెలకొంది. బస్సు షెల్టర్‌లు లేకపోవడంతో మహిళలకు భద్రత కరువైంది.



శిథిలావస్థకు చేరుకున్న రావిరాల బస్‌షెల్టర్



సౌకర్యాలు లేని నెల్లికుదురు బస్టాండ్

రాత్రివేళలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న మహిళలు దొంగల భయంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆయా గ్రామాల స్టేజీలవద్ద బస్‌షెల్టర్‌లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సయస్యల వలయంలో నెల్లికుదురు బస్టాండ్

నెల్లికుదురు మండలకేంద్రంలో ప్రయాణికుల సౌకర్యం కోసం పదేళ్లక్రితం నిర్మించిన బస్టాండ్ భవనం సమస్యల వలయంలో ఉంది. లక్షలాది రూపాయలు వెచ్చించి, నిర్మించిన భవనంలో త్రాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం, విద్యుత్ సౌకర్యంలేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లులేక పోవడంతో మహిళ ఇక్కట్లు పడుతున్నారు. రోజుకు వందలాది మంది వస్తుపోతున్న ప్రయాణికులకు బస్టాండ్‌లో అరకొర వసతుల మధ్య కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లో మౌళిక సౌకర్యాలు కల్పించి, ప్రయాణికులు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

మదనాపురంలో ఆధ్యాత్మిక శోభ

● వేంకటేశ్వరస్వామి, గ్రామదేవతలు, ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణం

● రూ.1.50 కోట్లతో గ్రామంలో ప్రగతి పనులు పూర్తి

గూడూరు, ఏప్రిల్3 : సొంత లాభం.. కొంత మానుకుని.. పొరుగు వారికి తోడ్పడవోయి... అన్న గురజాడ అప్పారావు మాటలను స్ఫూర్తిగా తీసుకున్న లింగాల సుధీర్‌రెడ్డి-రాధిక దంపతులు తనసొంత ఖర్చులతో ఊరిని అభివృద్ధి చేస్తున్నారు. 2016లో అప్పటి సీఎం కేసీఆర్ గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలన్న పిలుపు మేరకు మదనాపురం గ్రామానికి చెందిన దివంగత లింగాల పద్మ-వెంకట్‌రెడ్డి దంపతుల కుమారుడు, స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ సుధీర్‌రెడ్డి గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వారి పేరుపై చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేశారు. ఎల్ఎస్ఆర్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థనుస్థాపించి, తద్వార 1.20 కోట్లతో గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, గోశాల, అర్చకుల నివాస గృహ సముదాయం నిర్మించారు. రూ.8.50 లక్షలతో వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఆరోగ్య ఉపకేంద్రం కోసం భవన నిర్మాణాన్ని చేపట్టి, అందుబాటులోకి తీసుకువచ్చారు. రూ.2 లక్షలతో గ్రామశివారులో ముత్యాలమ్మతల్లి ఆలయాన్ని నిర్మించారు. ముదిరాజ్‌ల ఆరాధ్య దైవమైన గంగమ్మ తల్లి ఆలయానికి రూ.2 లక్షలు వెచ్చించి పనులు పూర్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం వారికి సైన్స్‌పై ఆసక్తిని పెంచేందుకు రూ.8.5 లక్షలతో సైన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయించారు. గ్రామంలో మరుగుదొడ్లు లేకుండా ఇబ్బందులు పడుతున్న 42 మంది నిరుపేదలను గుర్తించి వారికి సుమారు రూ.4 లక్షలతో మరుగుదొడ్లను నిర్మించి ఇచ్చారు. గ్రామంలో ఎవరైన మృతి చెందినప్పుడు అంతిమ సంస్కారాల కోసం గ్రామశివారులో రూ.8 లక్షలతో వైకుంఠధామం పనులు ప్రారంభించారు. దీంతో గ్రామంలో సుధీర్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రజలకు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



లింగాల సుధీర్‌రెడ్డి నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం



విగ్రహాలకు పూజలు చేస్తున్న లింగాల సుధీర్‌రెడ్డి, రాధిక దంపతులు

ఆలయంలో పూజలు..

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గత మూడ్రోజులుగా పూజలు కొనసాగుతున్నాయి. ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం లింగాల సుధీర్‌రెడ్డి-రాధిక దంపతులచే పూజారులు ముడుంబై లక్ష్మీనారాయణాచార్యులు, గొడవర్తి శ్రావణ్‌కుమార్ చార్యులు శాంతిపాఠం, ద్వారతోరణం, ధ్వజకుంభారధన, మూలమంత్రమూర్తి, మంత్రహోమాలు, యాగశాలలో అధివాసాంగ హోమము, తత్వన్యాసహోమములు, నిత్యాపూర్ణాహుతి, ప్రతిష్ఠామూర్తులకు ధన, ధాన్య, ఫల, పుష్ప, శయ్యాధివాసములు, నివేదన, తీర్థగోష్ఠి నిర్వహించారు.

గ్రామస్తులు సహకరిస్తే మరింత అభివృద్ధి..

లింగాల సుధీర్‌రెడ్డి-రాధిక

మదనాపురంలో ఒకప్పుడు వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండేవారు. తనవంతుగా గ్రామానికి ఏదైన ఒకటి చేయాలన్న ముఖ్య ఉద్దేశంతో తన సొంత ఖర్చులతో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, గోశాల, ముత్యాలమ్మగుడి, గంగమ్మ ఆలయం, ఆరోగ్య ఉపకేంద్రం నిర్మించి అందుబాటులోకి తెచ్చాం. గ్రామ ప్రజలు సహకరిస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తాం.

ప్రింటర్‌లో దూరిన పాము

కేసముద్రం, ఏప్రిల్ 3 : తనషాపులో ఉన్న ప్రింటర్‌లో జిరాక్స్ తీద్దామని ఆన్ చేయగా అందులో పాము తల కనిపించగానే తీవ్ర ఆందోళన చెందిన యువకుడు దాన్ని బయటకు రప్పించేందుకు నానా తంటాలు పడాల్సివచ్చింది. కేసముద్రం స్టేషన్ ఉప్పరపల్లిరోడ్‌లో కంప్యూటర్, ప్రింటర్లు రిపేర్ చేసే షాపును మనోజ్ అనేవ్యక్తి నిర్వహిస్తున్నాడు. తనషాపులో ఉదయం జిరాక్స్ కాపీ తీసేందుకు టేబుల్‌పై పెట్టిన ప్రింటర్‌ను ఆన్ చేశాడు. ప్రింటర్ ఆన్ అయిన శబ్దానికి అందులో అప్పటికే దూరి ఉన్న పాము తల బయటకు పెట్టి కనిపించి మళ్లీ లోపలికి వెళ్లి పోయింది. వెంటనే మనోజ్ ఆ ప్రింటర్‌ను ఆఫ్ చేసి షాపు బయటకు తీసుకువచ్చాడు. ప్రింటర్‌కు ఉన్న అన్నివైపులా డోర్‌లు విప్పినప్పటికీ పాము మాత్రం బయటకు రాలేదు.

ఈ తతంగాన్ని అటుగా వెళుతున్న పలువురు అక్కడే నిలిచి ఆసక్తిగా చూస్తున్నారు. చివరకు ప్రింటర్ అడుగుభాగంలోని చిన్న ఖాళీ స్థలంలో దాక్కొని కనిపిస్తున్న ఆకుపచ్చ రంగులోని పామును కర్ర సహాయంతో బయటకు లాగడంతో

బయటకు తీసేందుకు తంటాలు

వెంటనే అది బయటకు వచ్చి క్షణాల్లో వేగంగా పరిగెత్తి సమీపంలోని చెట్టుపైకి పాక్కుంటూ వెళ్లింది. స్వల్ప విషపూరితమైన ఈ పామును ఆవులమాస, పసిరిక, చెట్టురుక పేర్లతో పిలుస్తారని పలువురు తెలిపారు. ఎట్టకేలకు పాము బయటకు రావడంతో ఉత్కంఠకు తెరపడినట్లయింది.

చెరువులో పడి యువకుడి మృతి



వీరన్న (ఫైల్)

నెల్లికుదురు, ఏప్రిల్3 : చెరువులో పడి యుకుడు మృతి చెందిన ఘటన వావిలాలలో ఆలస్యంగా వెలుగు చూసింది. బుధవారం ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం. గ్రామానికి చెందిన గుండెపాక వీరన్న (28) ఈనెల 1న కురవి మండలం నేరడలో బంధువుల ఇంటిలో నిర్వహిస్తున్న గ్రామదేవత పండుగకు వెళ్లాడు. సాయంత్రం మద్యం తాగి స్వగ్రామం వావిలాలకు తిరిగి వచ్చి చెరువువైపు వెళ్లాడు. తెల్లవారు జామున ఇంటికి రాకపోవడంతో ఆచూకి తెలియకపోవడంతో తన తండ్రి గుండెపాక భిక్షం ఈనెల 2న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం గ్రామస్థులుచెరువులో చూడగా వీరన్న శవమై కనిపించారు. మృతుడి తండ్రి భిక్షం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

● ముగ్గురిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 4 : జిల్లా కేంద్రంలోని హనుమం తుడి గడ్డ నుంచి అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నామని టౌన్ సీఐ పెండ్యాల దేవేం దర్ బుధవారం తెలిపారు. అలాగే రవాణాకు ఉపయోగించిన బొలెరో వాహనాన్ని సీజ్‌చేసి, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. మానుకోట జిల్లా కేంద్రంలోని తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్ర యించేందుకు తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జిల్లెలతండాలో జ్వరాలపై సర్వే

కేసముద్రం, ఏప్రిల్3 : మండలంలోని కాట్రపల్లి శివారు భవానిగడ్డతండా జీపీ జిల్లెలతండాలో జ్వరాలు వ్యాప్తి చెందడంపై ఇంటికన్నె సబ్‌సెంటర్ పరిధిలోని వైద్యాధికారులు బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరాలు వచ్చిన వారినుంచి రక్తనమూనాలను సేకరించారు. ఈ సర్వేను నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్‌బర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ) జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధీర్‌రెడ్డి పరిశీలించారు. వైద్యాధికారి నంబి కిషోర్, ఎస్‌యువో గోపిచంద్, హెచ్‌ఈ పురుషోత్తం, ఎంపీహెచ్ఎస్ జనార్దనాచారి పాల్గొన్నారు.

'వరంగల్'పై బీఆర్ఎస్ గురి!

(5వ పేజీ తరువాయి)

వర్గం ఓట్లున్నాయి. అయితే ఇప్పటికే బీజేపీ మాదిగ సామాజిక వర్గం నేతకు టికెట్ ఇవ్వగా, కాంగ్రెస్ మాదిగ సామాజిక వర్గంలోని ఉపకులానికి చెందిన మహిళ నేతకు టికెట్ ఇచ్చారు. దీంతో బీఆర్ఎస్ ఏ వర్గం వైపు మొగ్గు చూపుతుందనే ఉత్కంఠ పార్టీలో నెలకొంది. మాల సామాజిక వర్గం నుంచి పెద్ది స్వప్న, మాదిగ సామాజిక వర్గం నుంచి తాటికొండ రాజయ్య పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వీరితో పాటు మరో ఐదారుగురి పేర్లను కూడా అధిష్ఠానం పరిశీలిస్తోంది. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ మాదిగ సామాజిక వర్గం నుంచి టికెట్ ఇవ్వగా, బీఆర్ఎస్ కూడా అదే సామాజిక వర్గం నుంచి టికెట్ ఇస్తుందా లేక మాల సామాజిక వర్గం నుంచి టికెట్ ఇస్తుందా అనే చర్చ పార్టీలో జరుగుతోంది. మొత్తానికి గులాబీ పార్టీలో టికెట్ల పంచాయితీ తెరపైకి రావటంతో ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ పార్టీలో కనిపిస్తోంది.

'తాగునీటి ఎద్దడికి చర్యలు చేపట్టాలి'

డోర్నకల్, ఏప్రిల్ 3 : వేసవిలో ప్రజలకు అవసరమైన తాగునీటి ఎద్దడి నివారణపై చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి నర్సింహామూర్తి సూచించారు. డోర్నకల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహామూర్తి మాట్లాడుతూ- గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణ కోసం అందుబాటులో ఉన్న ప్రభుత్వ నిధులను పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వినియోగించుకోవాలని చెప్పారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో మున్వర్‌బేగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరుణ పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

డోర్నకల్, ఏప్రిల్ 3 : ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధంలాంటిదని, ప్రతీ ఒక్కరు ఓటుహక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెట్టాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, జిల్లా స్వీప్ నోడల్ అధికారి మరియన్న అన్నారు. బుధవారం మండలంలోని మోడల్‌స్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో ఓటరు చైతన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీరోలు తహసీల్దార్ ఆర్.శారద, ఆర్ఐ రామ పాల్గొన్నారు.

పెద్దకిష్టాపురంలో వృద్ధురాలి మృతి

గార్ల, మే 3 : పెద్దకిష్టాపురంలో వడదెబ్బకు హలవత్ లక్ష్మి (55) మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. మూడు రోజులుగా ఎండతీవ్రత తట్టుకోలేక వాంతులు, విరోచనాలు బాధపడుతూ ఆరోగ్యం క్షీణించి, మృత్యువాత పడింది. మృతురాలు భర్త హలవత్ మంగ్యి 25 ఏళ్ల కిందట చనిపోగా, వారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండేళ్ల క్రితం ఇరువురు కుమారులు అనారోగ్యంతో మరణించారు. ఓ కుమార్తెకు వివాహం చేయగా, ఇంటి వద్దనే ఉంటు చదవుకుంటున్న చిన్న కుమార్తె హలవత్ స్వప్న తల్లికి తలకొరివి పెట్టింది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

కొత్తగూడ, ఏప్రిల్ 3 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ (జీసీసీ) మేనేజర్ సమ్మయ్య సూచించారు. కొత్తగూడలో జీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ-గ్రేడు రకం ధాన్యం క్వింటాకు రూ.2,203, సాధారణ రకం రూ.2,183 చొప్పున ధరతో కొనుగోలు చేస్తారని తెలిపారు. సేల్స్‌మెన్ చత్రునాయక్, రైతులు గుమ్మడి సమ్మయ్య, పరుశురాం, వేల్పుల వెంకన్న, కొత్తూరు కృష్ణ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో గుడుంబా పట్టివేత

తొర్రూరు/తొర్రూరు రూరల్, ఏప్రిల్ 3 : అక్రమంగా తరలిస్తున్న 50 లీటర్ల గుడుంబాను పట్టుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఆర్.ప్రవీణ్ తెలిపారు. బుధవారం సాయంత్రం స్టేషన్ పరిధిలోని గ్రామాలతో పాటు డివిజన్ కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న 50 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా గుడుంబా, నాటుసారా, బెల్లం పానకం తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటుసారా తయారు చేసినా, తరలించినా ఫోన్ 87126 59015 నంబరులో తెలియజేయాలన్నారు. ఈ దాడుల్లో కె.తిరుపతి, అనిల్, సత్యప్రసాద్, మదర్‌ఖాన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మరిపెడ ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

మరిపెడ, ఏప్రిల్ 3 : మరిపెడ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ బుధవారం ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఆ క్లబ్ గౌరవ అధ్యక్షుడు గంధసిరి ఉప్పలయ్యగౌడ్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా ఎండీ రియాజ్, ఉపాధ్యక్షులుగా బోడా నాగేందర్, శ్రీకుమార్, ప్రధాన కార్యదర్శిగా రాంపెల్లి వీరాంజీ, ట్రెజరరీగా మచ్చా రాజేశ్, సహాయ కార్యదర్శులుగా ఎం.మహేందర్, మాలోత్ తిరుపతి, ఎస్కే.షాన్‌వాజ్ ఎన్నికయ్యారన్నారు. కార్యవర్గ సభ్యులుగా ఎం.సంజీవ, బోడా శ్రీనివాస్, బోడపట్ల వెంకన్న, బీఎస్ రాజు, సాయికుమార్, వీవీ నర్సింహారెడ్డి, గౌరవ సలహాదారులుగా శ్రీరంగం శ్రీనివాస్, గాడిపెల్లి శ్రీశైలం, పీ.వేణుగోపాల్, ఎస్కే.సత్తార్‌పాష, గంధసిరి రవి, భర్తపురం వెంకటమల్లేశ్ ఎన్నికయ్యారన్నారు. ఎన్నికల పర్యవేక్షకులుగా శ్రీనివాస్, శ్రీశైలం హాజరయ్యారు. జర్నలిస్టులు అక్తర్‌పాష, తిరుమల్, రాజేశ్, వెంకటేశ్వర్లు, ఉమేశ్, మహేశ్‌బాబు, సురేశ్ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే వడదెబ్బ నుంచి రక్షణ

చిన్నగూడూరు, ఏప్రిల్ 3 : అప్రమత్తతతోనే వడదెబ్బ నివారణ సాధ్యమని ఉగ్గంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రామారావు అధ్యక్షతన వడదెబ్బ నివారణ, అవగాహనపై మండల టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం హీట్‌వేవ్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్ పర్సన్‌గా తహసీల్దార్ మహబూబ్ అలీ, మెంబర్ కన్వీనర్‌గా వైద్యాధికారి ప్రవీణ్, మెంబర్‌గా ఎస్సై ఝాన్సీ ఉంటారని, దురదృష్టవశాత్తు ఎవరైనా వడదెబ్బ వలన చనిపోతే ఈ కమిటీకి తెలియజేయాలన్నారు. ఎంపీవో యాకయ్య, ఐసీడీఎస్ సూపర్వైజర్ కవిత, కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు ఉన్నారు.

'ఆన్‌లైన్‌లో నగదు కోల్పోతే ఫిర్యాదు చేయాలి'

తొర్రూరు, ఏప్రిల్ 3 : ప్రపంచీకరణ టెక్నాలజీ పెరుగుతున్నందున విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కె.జగదీష్ అన్నారు. బుధవారం తొర్రూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్, ఇంటర్నెట్, వాట్సాప్‌లలో అపరిచిత వ్యక్తులు పంపే సందేశాలకు స్పందించవద్దని తెలిపారు. ఆన్‌లైన్‌లో నగదు కోల్పోతే 24గంటల లోపు ఫిర్యాదు చేస్తే రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ బొలగం రాములు, అధ్యాపకులు రమణ, సునిల్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

'ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 3 : లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు సౌకర్యాలు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నేతలు సంకా బద్రినారాయణ, యాకూబ్, రమేష్, లచ్చిరాంకిషన్‌నాయక్, సయ్యద్‌గౌస్ అన్నారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ విధులు నిర్వహించలేని దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులను విధుల నుంచి మినహాయించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

● పీఆర్టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘురెడ్డి, మురళి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బందికి అన్ని వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, సయ్యద్ గౌస్, కుమారస్వామి, సాయికృష్ణ, అనిత తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికుల నిర్మూలన చట్టానికి తూట్లు..

● ఎలక్షన్ శిక్షణలో పాల్గొన్న ఉద్యోగులకు భోజనం వడ్డించిన బాలుడు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్3 : బాలకార్మిక నిర్మూలన చట్టాలు పకడ్బందీగా ప్రభుత్వాలు రూపొందించినప్పటికి అవి అమల్లో మాత్రం నీరుగారిపోతున్నాయి. నామ్‌కే వాస్తేగా సంవత్సరానికి రెండు, మూడుసార్లు ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా బాలకార్మికులను పట్టుకోవడానికి అధికారులు తూతూ.. మంత్రంగా తనిఖీలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. తాజాగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయంలో బుధవారం పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. వారికి ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ ఉండడంతో మధ్యాహ్నం వేళలోఎన్నికల సిబ్బందికి భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఓ మెస్‌కు అప్పగించడంతో నిర్వాహకుడు బాలుడితో ఎన్నికల సిబ్బందికి భోజనం వడ్డించాడు. బాలుడు వడ్డించడాన్ని గమనించిన ఉపాధ్యాయులు నువ్వు ఎందుకు వడ్డిస్తున్నావు.. పాఠశాలకు వెళ్లడం వెళ్తున్నావా.. అని ప్రశ్నించగా ఆ బాలుడు మానుకోటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నట్లు చెప్పాడు. దీంతో అక్కడ భోజనం చేసే ఉపాధ్యాయుల్లో బాలుడి చేత వడ్డించే అంశంపై చర్చ జరిగింది.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి

తొర్రూరు, ఏప్రిల్ 3 : భద్రాచల సీతారామ కల్యాణాన్ని పురస్కరించుకుని భక్తులకు తలంబ్రాలు అందించేందుకు ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. తొర్రూరులో టీఎస్‌ఆర్టీసీ సీతారాములు కల్యాణ తలంబ్రాల వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాములవారి కల్యాణ తలంబ్రాలు కావాలనుకునే వారు ఆర్టీసీ కార్గో సిబ్బందికి రూ.151 చెల్లిస్తే నేరుగా ఇంటి వద్దకే భద్రాచల సీతారామ కల్యాణ తలంబ్రాలు అందిస్తారని తెలిపారు. ఆర్టీసీ భక్తులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9154298766, 8374864357 నంబరులో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, ఆర్టీసీ లాజిస్టిక్ సిబ్బంది చైతన్యకుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



గాంధీనగర్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొత్తగూడ, ఏప్రిల్ 3 : విద్యార్థులు సైబర్ క్రైం, డయల్ 100, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైం సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. కొత్తగూడ మండలం గాంధీనగర్‌లోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినీలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ దిలీప్ పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరుకున్న జ్యోతక్క

● స్వాగతం పలికిన జడ్పీటీసీ



హరిపిరాలలో జ్యోతక్కను సన్మానిస్తున్న జడ్పీటీసీ

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 3 : జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్నాద్ కేకన్ ఎదుట అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల లొంగిపోయిన మావోయిస్టు షేక్ ఇమామ్‌బీ అలియాస్ జ్యోతక్క ఆమె సొంతగ్రామం తొర్రూరు మండలం హరిపిరాల గ్రామానికి చేరుకున్నారు. ఇన్నాళ్లు అజ్ఞాతంలో ఉండి ఇంటికి చేరుకోవడంతో వృద్ధాప్యంలో ఉన్న తల్లి, కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ స్వాగతం పలికారు. బుధవారం విషయం తెలుసుకున్న జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, గ్రామస్థులు ఆమె వద్దకు వెళ్లి స్వీట్లు పంపిణీ చేసి శాలువాతో సత్కరించి, ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ మావోయిస్టు భావజాలంతో జీవనం సాగించి భారతరాజ్యాంగంపై నమ్మకంతో జనజీవన స్రవంతిలోకి రావడం హర్షణీయమన్నారు. అనారోగ్యంతో ఉన్న జ్యోతక్కను, కుటుంబానికి ప్రజలు, ప్రభుత్వం అండగా ఉంటూ ఆదుకోవాలని కోరారు.

సంత్ సేవాలాల్ జయంతి

మరిపెడ రూరల్, ఏప్రిల్ 3 : మండలంలోని బోట్యా తండా జీపీ పరిధిలోని జమ్మికుంట తండాలోని సద్గురు సంత్ సేవాలాల్, మేరమ్మ ఆలయంలో సంత్ సేవాలాల్ మేరమ్మ యాడి భోగ్ బండారో వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రు నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నైవేద్యాన్ని సమర్పించి, మొక్కులు సమర్పించారు. మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, పెద్దబోయిన ఐలమల్లు, గండి వీరభద్రం, గుగులోతు పాప, సుమన్, వెంకటేష్, సాయి పాల్గొన్నారు.